క్లుప్తంగా

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన



వినుకొండ: పట్టణంలోని ఏనుగుపాలెంలో రోడ్డులోని రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు పరిశీలన చేశారు. స్థానిక తహసీల్దార్ సురేష్‌నాయక్, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ చండీరాణి, ఆర్ఐ శ్రీధర్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై సంపూర్ణ సమీకృత దాణా

నూజెండ్ల: సమీకృత దాణా వల్ల పశువులకు కావల్సిన పోషక పదార్థాలు సరైన మోతాదులో లభిస్తాయని పశు వైద్యాధికారి శివాజీ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం సమీకృత దాణా పంపిణీ చేపట్టారు. పశువైద్యాధికారి శివాజీ మాట్లాడుతూ వేసవిలో పశుగ్రాసం కొరత నివారించి, నిలకడగా పాడి ఉత్పత్తులు పెంపొందించేందుకు సమీకృత దాణా ఉపయోగపడుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలానికి 10 టన్నులు దాణా కేటాయించటం జరిగిందన్నారు. రాయితీ సౌకర్యం పొందాలంటే పశుధన్ యాప్‌లో పేరు నమోదు అయిఉండి పశువులకు టీకాలు వేసి ఉండాలన్నారు. కావల్సిన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్లవెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం



వినుకొండ: పౌర గ్రంథాలయ శాఖ, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు స్థానిక వినుకొండ శాఖ గ్రంథాలయం నందు గత వారం రోజుల నుండి వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ వేసవి శిబిరంలో విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది. అలాగే బుక్ ఎగ్జిబిషన్, యోగ తదితర అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది అని గ్రంథాలయ అధికారి భూక్యాబద్రి నాయక్ తెలియజేశారు.

వందమందికి పైగా ఆధార్ సేవలు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ సేవా కేంద్రాలు రెండో రోజు పనిచేశాయి. ఆధార్‌లో సవరణలు, శిశు ఆధార్, ఐదేళ్ళు పైబడిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ తదితర సేవలందిస్తున్నారు. రెండోరోజు వందమందికి పైగా కార్డుదారులు ఆధార్ అప్‌డేట్ సేవలు వినియోగించుకున్నారు. బుధ, గురువారాలు, ఈ నెల 12–15 తేదీల్లో విడతల వారీగా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ సేవలందించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పురుషోత్తమపట్నం, శాంతినగర్, ఆది ఆంధ్రా కాలనీ, సుగాలీకాలనీ, ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

చిలకలూరిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయ సంఘం కృషి చేయడం అభినందనీయమని ఎంఈవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ రూపొందించిన కరపత్రాన్ని మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం సంఘ నాయకులతో కలసి ఎంఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువమంది విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయ సంఘం కృషి చేయడం సామాజిక బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్, నాయకులు ఎస్‌కె ఎండీ యాసిన్, కె.రవి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమావేశం

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆషాలు ముందుండాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్ పున్నారావు తెలిపారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోగ్య రంగంలో వారి సేవలు అమూల్యమని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కొనియాడారు.

గణపవరంలో ఆగిన అభివృద్ధి

- తేలని విలీన ప్రక్రియ
- ప్రభుత్వం నుంచి నిధులు బంద్
- జీతభత్యాలకూ చాలని పన్నుల వసూళ్లు



గ్రామ పంచాయతీ భవనం ముందుభాగం

నాదెండ్ల: గణపవరం గ్రామ పంచాయతీ అభివృద్ధి పైన పటారం.. లోన లొటారం అన్న చందంగా మారింది. 1958లో గ్రామ పంచాయతీ ఏర్పడింది. గణపవరంలో మొత్తం నాలుగు సచివాలయాలు ఉండగా, ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో 1,2 గ్రామ సచివాలయాలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం 2019లో చిలకలూరిపేట మున్సిపాలిటీలో గ్రామాన్ని విలీనం చేస్తూ గజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత గ్రామానికి చెందిన కొందరు గ్రామాన్ని విలీనం చేయవద్దంటూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో న్యాయస్థానం విలీనాన్ని నిలుపుదల చేస్తూ స్టే విధించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు రావటంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోనే ఎన్నికలు జరిగాయి. గ్రామంలో జనాభా ప్రకారం ఐదు మున్సిపల్ వార్డులను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు.

కుంటుపడిన అభివృద్ధి

పంచాయతీని చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేయకుండా న్యాయస్థానం స్టే విధించటంతో గ్రామ అభివృద్ధికి గ్రహణం పట్టింది. విలీనమైన కొన్ని నెలల పాటూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనులు జరిగాయి. స్టే విధించటంతో మున్సిపాలిటీ నుంచి రికార్డులు తిరిగి పంచాయతీకి చేరాయి. అప్పటి నుంచి మేజర్ పంచాయతీకి రావలసిన ఆర్థిక సంఘం నిధులు, గ్రాంట్లు విడుదల కాలేదు. మున్సిపాలిటీ పరిధిలో రావలసిన నిధులు సైతం నిలిచిపోయాయి. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జరగాల్సిన పనులు నిలిచిపోవటంతో ఇటు అభివృద్ధి జరక్క, అటు పేదలకు ఉపాధి దొరక్క సతమతమౌతున్నారు.



పంచాయతీ భవనం వెనుకభాగంలో మొలిచిన మర్రి మొక్కలు

పన్నులతోనే సరి...

గ్రామ పంచాయతీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాకపోవటంతో తాగునీటి సరఫరాలో అంతరాయం, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి నెలలు తరబడి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రతి ఏడాది రూ.80 లక్షలు ఆస్తి, నీటి పన్నులు వసూలు లక్ష్యం కాగా, మార్చి చివరి నాటికి రూ.50 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. గ్రామ పరిధిలో కరోనా అనంతరం పత్తి ఆధారిత పరిశ్రమలు మూతపడటంతో పన్నుల వసూలుపై ప్రభావం పడింది. వచ్చే ఆదాయం పారిశుద్ధ్య నిర్వహణ, జీతాల చెల్లింపులకు సరిపోతుంది.

స్టే ఎత్తివేసి విలీనం చేయాలి

చిలకలూరిపేట మున్సిపాలిటీలో గ్రామ పంచాయతీ విలీనమైతేనే గ్రామాభివృద్ధి వేగమౌతుందని గ్రామస్తులు ఆశిస్తున్నారు. న్యాయస్థానంలో స్టే ఉన్నందున అధికారులు చర్యలు వేగవంతం చేసి స్టే ఎత్తివేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు పంచాయతీ భవనం

1983 వరకూ గ్రామంలోని లైబ్రరీలో ఓ పక్క పంచాయతీ కార్యాలయం నడిచింది. ఆతర్వాత గ్రామానికి చెందిన కోంద్రు సింగయ్య 10 సెంట్లు స్థలాన్ని పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి దానం చేశారు. ఆ స్థలంలో పంచాయతీరాజ్ నిధులతో 1983లో భవనం నిర్మాణమైంది. అప్పటి పంచాయతీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించి 1984 నుంచి పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. ప్రస్తుతం భవనం వెనుకభాగంలో మర్రి మొక్కలు మొలిచి గోడలు పగుళ్ళిచ్చి, వర్షం కురిస్తే భవనంలోకి నీరు చేరుతోంది. ముఖ్యంగా రెవెన్యూ విభాగం ఉండే గదిలో శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి.

జీతభత్యాలకే ఆదాయం సరిపోతోంది



గ్రామంలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్ళతోనే గ్రామ నిర్వహణ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరుకావటం లేదు. స్టాంపు డ్యూటీ నిధులు గతేడాది సెప్టెంబర్ నెల నుంచి పంచాయతీకి జమ కావటం లేదు. వృత్తి పన్నులు ఏడాది నుంచి సరిగా వసూలు కావటం లేదు. జనాభా ప్రాతిపదికన మంజూరయ్యే నిధులు గత నాలుగేళ్లుగా విడుదల కావటం లేదు. కరోనా అనంతరం పత్తి ఆధారిత మిల్లులు మూసివేయడంతో పన్నుల్లో 30–40 శాతం మేర వసూళ్లు తగ్గిపోయాయి. ఖజానాకు జమయ్యే అరకొర నిధులతో జీతభత్యాల చెల్లింపు, పారిశుద్ధ్య నిర్వహణకు సరిపెడుతున్నాం.

–మారుతీబాబు, పంచాయతీ కార్యదర్శి

మహాసభలను విజయవంతం చేయండి

బొల్లాపల్లి: సీపీఐ మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల 9న ఉదయం 10గంటలకు మండల కేంద్రమైన బొల్లాపల్లి ప్రభుత్వ కార్యాలయాలకు ఎదురుగా మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ. మారుతివరప్రసాద్, నియోజకవర్గ సమితి కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పలువురు నాయకులు హాజరవుతారని, మండలంలోని గ్రామాల నుంచి పార్టీ సభ్యులు, సానుభూతిపరులు తదితరులు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

త్వరలో న్యాయవాద సంఘ ఎన్నికలు

నరసరావుపేటటౌన్: త్వరలో నరసరావుపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది, ఎన్నికల కమిషన్ చైర్మన్ మోరా ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం న్యాయవాద సంఘ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి నియమ నిబంధనలను అనుసరించి వారం రోజుల్లో 2025–26 న్యాయవాద సంఘ ఎగ్జిక్యూటివ్ నూతన బాడీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు న్యాయవాద సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీగిరి రాజు అయ్యప్పరాజు, జీవీ సుబ్బారావు, బి.వి.ఆర్. ప్రసాద్ రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు చౌదరి, కె. సీతారామాంజనేయులు, దాసరి ఉదయ్ శ్రీ, ఎం. సుభాషిణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

- సూక్ష్మపోషకాల లభ్యత, సేంద్రియ కర్బణాలస్థాయి తెలుసుకోవచ్చు
- డీటీసీ డీడీఏ ఎం.శివకుమారి
- వేర్వేరు ప్రాంతాల్లో మట్టి నమూనాల సేకరణ

నరసరావుపేట రూరల్: భూసార పరీక్షలతో అధిక దిగుబడి పొందడానికి వీలు పడుతుందని డీటీసీ డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని యల్లమంద గ్రామంలో మంగళవారం మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ మండలంలో 25 రైతు సేవా కేంద్రాలకు 1400 మట్టి నమూనాలను లక్ష్యంగా ఇచ్చినట్టు తెలిపారు. మట్టి నమూనాల సేకరణకు రైతులు సిబ్బందికి సహకరించి మీ నేలకు సంబంధించి మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మట్టి పరీక్షల వలన నేలలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాల లభ్యత, సేంద్రీయ కర్బణాల స్థాయిని తెలుసుకోవచ్చని తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రధాన, సూక్ష్మ పోషకాలను సవరించుకొని అవసరం మేరకు ఎరువులను వాడుకొని పెట్టుబడి తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, ఏఈవో కె. బ్రహ్మయ్య, వీఏఏ కె.సాయినాథ్ రైతులు పాల్గొన్నారు.



యల్లమందలో మట్టినమూనాలు సేకరిస్తున్న అధికారులు, సిబ్బంది



నూజెండ్ల మండలంలో మట్టి నమూనాల సేకరణలో వ్యవసాయాధికారి సుగుణాబేగం

నాజెండ్ల మండలంలో...

నూజెండ్ల: భూసార పరీక్షలు ఆధారంగానే రసాయనిక ఎరువుల మోతాదును రైతులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి సుగుణాబేగం అన్నారు. మండలంలోని ఐనవోలు, చింతలచెరువు రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం మట్టి నమూనా సేకరణ చేపట్టారు. వ్యవసాయాధికారి సుగుణాబేగం మాట్లాడుతూ మండలంలో సేకరించిన మట్టి నమూనాలు భూసార పరీక్షా కేంద్రాలకు పంపటం జరుగుతుందన్నారు. క్షేత్ర సందర్శనలో గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, మణికంఠ, రైతులు పాలొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: మట్టి పరీక్షల ఆధారంగా ఏ పంట ఏ నేలకు అనుకూలం, ప్రతికూల నేలల్లో లోపాలను సవరించుటకు తీసుకోవాల్సిన చర్యలు, ఎరువుల వినియోగం, సూక్ష్మధాతు లోప నివారణ చేసేందుకు సాధ్యమౌతుందని నరసరావుపేట వ్యవసాయశాఖ ఏడీ మస్తానమ్మ చెప్పారు. గణపవరంలో 2025–26 ఖరీఫ్ సీజన్‌కు మట్టి పరీక్షల నమూనాల సేకరణ ప్రారంభించారు. గ్రామంలో 120 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, స్థానిక వ్యవసాయాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసవిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మట్టి నమూనా తీసే విధానం, క్వాట్రింగ్ పద్ధతిలో మట్టి నమూనాల సేకరణ విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు జీవన్‌నాయక్, లక్ష్మానాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు రైతులు సహకరించాలి

శావల్యాపురం: భూముల్లో పోషకాల లభ్యత గురించి రైతులు అవగాహన పెంపొందించటానికి భూసార పరీక్షలు ఎంతోగానో దోహదపడతాయని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో భూసార పరీక్షలు వ్యవసాయ అధికారులు రైతుల సమక్షంలో నిర్వహించారు. ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ భూసార పరీక్షలకు రైతులు వ్యవసాయ అధికారులకు సహకరించాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో మట్టినమూనా అందజేయాలన్నారు. భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలన్నారు. సమస్యాత్మక భూముల్లో భూసార పరీక్షలు చేయటం ద్వారా పోషకాలు లభ్యత ఆధారంగా పచ్చిరొట్ట ఎరువులు,జిప్సమ్ లాంటి వినియోగించటం ద్వారా పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. బొల్లాపల్లి మండలం–950 మట్టినమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 517 చేసినట్లు తెలిపారు. ఈపూరు మండలం–670 గాను 117, నూజెండ్ల–840–26, శావల్యాపురం–600 గాను 30, వినుకొండ రూరల్ మండలం 840 గాను 78 మట్టి నమూనాలు సేకరించామన్నారు. ఆయనతో పాటు ఏవో రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, వీఏఏ స్రవంతి, రైతులు ముక్కపాటి నాగేశ్వరరావు, అల్లు శేషయ్య, బోడెపూడి శ్రీను, ముంద్రు లక్ష్మయ్య ఉన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటల సాగులో పెట్టుబడి తగ్గడంతో పాటు ఆదాయం సమకూరుతుందని ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు పి.సైదయ్య తెలిపారు. మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై మంగళవారం రైతులకు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయవిధానం, ఆచరణ విధానంపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి ఘన, జీవామృతం వాడాలని, భూసారాన్ని పరిరక్షించాలని, భూమాతను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం శిక్షకులు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు మొగ్గుచూపాలని అన్నారు. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా పీఎండీఎస్ (నవధాన్యాలు) సాగు చేపట్టాలని ఈ విధానం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. అనంతరం మరో శిక్షకులు తిరుపతిరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా భూమి సారవంతమవుతుందని, రైతులు భూమిని ఏటీఎం మోడల్‌గా కూరగాయల సాగు చేపట్టాలని, వారి కుటుంబాలకు అవసరమైన కాయగూరలు, ఆకుకూరలు అందుబాటులోకి రావడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిస్థాయి నివారించి ఘన,జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గణపవరంలో మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

చిలకలూరిపేట: భూసార పరీక్షలతో ఎరువుల వాడకం తగ్గి వ్యవసాయ ఖర్చుల నియంత్రణతో పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట పొలాల్లోని మట్టి నమూనాలు సేకరించి ఇవ్వాలని తెలిపారు. వాటికి భూసార పరీక్షలు నిర్వహించి పోషకాల ఫలితాలు తెలుపుతూ భూసార పరీక్షల కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోషకాల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని తెలిపారు. దీని వలన ఎరువుల వాడకం నియంత్రించవచ్చన్నారు. నేలను సైతం సారవంతంగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు ఆగదు పోరాటం

9వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

నరసరావుపేట: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ ప్రభుత్వాన్ని కోరారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కుకు ఎదురుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) చేస్తున్న సమ్మె మంగళవారంతో తొమ్మిదవ రోజుకు చేరింది. మోకాళ్లపై కూర్చొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. అనుపమ మాట్లాడుతూ జిల్లాలో తాము 361 మంది ఆయుష్మాన్‌భవన్, రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వోగా పనిచేస్తున్నామన్నారు. తమ సమ్మెతో చాలాచోట్ల హెల్త్ సెంటర్లు మూతపడ్డాయన్నారు. ఉపాధ్యక్షులు కె.వినోద్, జిల్లా కోఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము, పలువురు సీహెచ్‌వోలు పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చొని నినాదాలు చేస్తున్న సిబ్బంది

కిశోరి వికాసంపై అవగాహన

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈపూరు ప్రాజెక్టు పరిధిలో రావులాపురం, మన్నేపల్లి తండా, ముప్పాళ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసంలో భాగంగా వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వారానికి రెండు రోజులు రోజుకు గంట వంతున ఈ కార్యక్రమానికి సమయం కేటాయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, కె.చిన్నమ్మాయి తెలిపారు. కమిటీ సభ్యులుగా మహిళా సంరక్షణ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ తదితరులు ఉంటారని వీరు కిశోర బాలికలకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, ఉపాధి నైపుణ్యం, లింగ వివక్షత వంటి విషయాలను కిశోర బాలికలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం

రొంపిచర్ల: మండలంలోని మునమాక, విప్పర్ల, రొంపిచర్ల సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను యుక్త వయస్సులో ఉన్న కిశోరి బాలికల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడతాయని డాక్టర్ సాయిబాబా అన్నారు. బాలికల విద్యా ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఋతు పరిశుభ్రత గురించి వివరించారు. కౌమార దశలో వచ్చేటటువంటి మార్పుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కె.శశీదేవి, డి. దేవి, షేక్ షమీం సుల్తానా, ఆయా అంగన్‌వాడీ టీచర్లు, కిశోరి బాలికలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

90 మందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల విప్పర్ల పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. ఎన్‌రోల్‌మెంట్ శిబిరాన్ని జీడీసీసీ బ్యాంక్ సంతగుడిపాడు బ్రాంచి మేనేజర్ ఎం. కోటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 29 మంది పెద్దలకు, పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకటరమణ ఆదేశాల మేరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏ శ్రీకాంత్, బ్యాంక్ సూపర్‌వైజర్ బి. వెంకటేశ్వర్లు, అధికారులు ఎస్. లక్ష్మీరెడ్డి, ఎస్. వీరారెడ్డి పాల్గొన్నారు.,

వేసవి తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



చిలకలూరిపేట: నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈవో ఎ శ్రీనివాసరావును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా తరగతులు నిర్వహించటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులు


బొల్లాపల్లి : నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తరువాత ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదయ్యాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గుట్లపల్లి గ్రామ పరిసరాల్లో స్టేషన్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నాటుసారాయికి వ్యతిరేకంగా గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు జరపడం జరిగింది. బొల్లాపల్లి మండలంలో 18, ఈపూరు మండలంలో 20, రొంపిచర్ల మండలంలో 20 కేసులు నమోదు చేసి 103 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కల్లులో ఎటువంటి కల్తీ జరగకుండా నివారించడం కోసం శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపడం జరిగిందన్నారు. స్టేషన్ పరిధిలో నాటుసారాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు మొదలైన నేరాల గురించి సమాచారం అందించాలని సూచించారు.



గుట్లపల్లిలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న అధికారులు

యానాది కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

నూజెండ్ల: యనాది కాలనీల్లో అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి యనాది డిమాండ్ చేశారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని యానాది కాలనీలో మంచినీటి సౌకర్యాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్, రేషన్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ స్థలం మంజూరు చేసి శాశ్వత గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు గంగినేని బాబు,నరేష్, పాస్టర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి సౌకర్యం ప్రారంభిస్తున్న సంఘ నాయకులు,గ్రామ పెద్దలు